క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ పోలీసుల తనిఖీలు



తెలుగుతల్లి కూడలి వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో నగర కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్ఐ మల్లేశ్వరరావు తమ సిబ్బందితో తెలుగుతల్లి కూడలి వద్ద నగరంలో ప్రవేశించే వాహనాలను పరిశీలించారు. వాహనాల్లో నగదు, మద్యం, గంజాయి తదితర వస్తువులు రవాణా నియంత్రణలో భాగంగా సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు జరిగే వరకు ప్రతీ రోజు ఈ తనిఖీలు చేపడతామని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

అగనంపూడి: అగనంపూడి సిగ్నల్ జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంట్ రోడ్డులోని సూర్య టవర్స్ ఎదురుగా అపోలో ఫార్మసీ పక్కన ఆదివారం ఉదయం 8.30 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్ బి.కాళిదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యాలహారం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానంలో పాలుపంచుకోవాలని కోరారు. వివరాలకు 93461 24555, 98483 79334 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహా పాదయాత్ర నేడు

పెదగంట్యాడ: ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటనలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయనంటూ ప్రకటన చేయాలని ఐఎస్‌టీయూసీ ఆర్గనైజర్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు వరకూ మహా పాదయాత్ర చేస్తామని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఈ పాదయాత్రలో విశాఖ ఉక్కు పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

27న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ బి.సుజాత తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జీత భత్యాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు ఆ రోజు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని ప్రాంతీయ సంచాలకురాలు వెల్లడించారు.

27 నుంచి 9 కేంద్రాల్లో టెట్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-2024) ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. వీరి కోసం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు రావాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సమాచారం కోసం 9849245230, 6305538679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు

- భక్తులతో అప్పికొండ తీరం కళకళ
- సందడిగా మాధవ స్వామి మహాలక్ష్మి ఆలయ తీర్థం



పాత గంగవరంలో పూజలందుకుంటున్న మాధవ స్వామి, మహాలక్ష్మిదేవి



గంగవరంలో జాగరణ తీర్థంలో పాల్గొన్న జనం

పెదగంట్యాడ: మాఘ పౌర్ణమి వేడుకలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 64వ వార్డు పాత గంగవరంలో కొలువుదీరిన మాధవస్వామి మహాలక్ష్మి ఆలయ తీర్థం సందడిగా సాగింది. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్రంలో స్నానాలు ఆచరించారు. మాధవస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు మాధవస్వామి మహాలక్ష్మిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 77వ వార్డు అప్పికొండ తీరంలోనూ మాఘ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జాగారం చేసిన భక్తులు శనివారం ఉదయం అప్పికొండ తీరంలో



అప్పికొండ తీరంలో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు

పుణ్యస్నానాలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ మేలు



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉరుకూటి చందు



72వ వార్డులో పాదయాత్ర చేస్తున్న చందు

గాజువాక: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపకు మేలు జరుగుతోందని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌కు మరో ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని కోరుతూ 72వ వార్డులో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం చేపట్టిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల కష్టం తెలిసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇందుకు కారణమైన ఆయన మరో ఐదేళ్లు కొనసాగాలన్నదే ప్రజల అభీష్టమన్నారు. గాజువాకలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం, ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, పొగిరి రామకృష్ణ, ధనలక్ష్మి, విజయ, డేవిడ్, జానకి, రమణి, వర, సాయి, మధు, వెంకట్, ఉరుకూటి అప్పారావు, రామచంద్రరావు, సత్యనారాయణ, హేమలత, విజయ, ఫణి, దీప్తి, మురళి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి కలశాభిషేకం



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న తిప్పల రమణారెడ్డి దంపతులు, భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్ కొండపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి కలశాభిషేకం నిర్వహించారు. నదీ జలాలతో అభిషేకించారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిన కేంద్రం

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి నేడు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1108వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని ప్రైవేటీకరణ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ఇటువంటి ప్రభుత్వాల ఉనికి ప్రశ్నార్థకం కాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



1108వ రోజు ఉక్కు దీక్షలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

18 మంది 'విజ్ఞాన్' విద్యార్థులకు కొలువు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు హెచ్‌డీఎఫ్‌సీలో ఉద్యోగాలు పొందారు. కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో రూ.4.75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బొడే ప్రసాద్, అసోసియేట్ డీన్ హరీష్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎంబీఏ హెడ్ చంద్ర పాల్గొన్నారు.

మార్చిలో జాతీయ సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 27, 28 తేదీల్లో 'ధార్మిక ఆలోచనల ఆవిర్భావం–ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథం' అనే అంశంపై జరగనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

గాజువాక: శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలపై దృష్టి సారించే విధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ కె.సూరిబాబు అన్నారు. స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ నమూనాలను రూపొందిస్తున్న సమయంలో ఇతర విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలన్నారు. ప్రయోగాలు, శోధన, ప్రతి ఆకృతీకరణ, విశ్లేషణద్వారా విజ్ఞాన శాస్త్రంలో మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. భవిష్యత్ కాలంలో విజ్ఞాన శాస్త్రానిదే అంతిమ విజయంగా ఉంటుందని, ఈ తరుణంలో విద్యార్థులు మరింతగా రాణించి దేశ ప్రఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.మణి, ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత, తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చేనేత వస్త్రాలకు చిరునామా ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: చేనేత ఉత్పత్తులకు చిరునామా ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్, చేనేత, న్యూఢిల్లీ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన విక్రయ స్టాల్స్‌ను ఆయన స్థానిక శిల్పారామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో వస్త్రాల తయారీలో ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ మన చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులకు పోటీకాదన్నారు. రానున్న వేసవిలో ధరించడానికి చేనేత వస్త్రాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. మార్చి 8వ తేదీ వరకూ కొనసాగనున్న చేనేత మేళాలో వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి , రాష్ట్ర నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాయత్రీ నగర్ అప్పారావు పాల్గొన్నారు.

సహకార రంగంలో రాఘవేంద్రరావు సేవలు ప్రశంసనీయం

దాబాగార్డెన్స్: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నిక కావడంతో విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రతిష్ట మరింత పెరిగిందని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో అభినందన సభను బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సారథ్యంలో బ్యాంకులో పలు నూతన సాంకేతిక సేవలు ప్రవేశపెట్టి సభ్యులు, ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. సహకార స్ఫూర్తితో బ్యాంకును పురోభివృద్ధి దిశలో నడిపిస్తున్న చలసాని 20 ఏళ్లగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సహకార అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీలు బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో ఆర్‌బీఐ ఉన్నతాధికారుల దృష్టికి, రాష్ట్ర సహకార శాఖ అధికారుల దృష్టికి అర్బన్ బ్యాంకుల సమస్యలు తీసుకెళ్లిన చలసాని నాఫ్ కాబ్ డైరక్టర్‌గా ఎన్నిక కావడం సహకార అర్బన్ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ తనకు జరిగిన సత్కారం అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్యకు చెందుతుందన్నారు. సహకార వ్యవస్థ చాలా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని, సహకార వ్యవస్థ మనుగడకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ గౌరవ విశ్రాంత చైర్మన్ మానం ఆంజనేయులు, డైరెక్టర్లు గుడివాడ భాస్కరరావు, సూర్యనేని నాగభూషణ చౌదరి, అప్పారి జోసెఫ్ స్టాలిన్, నామన కామరాజు, కాకి భవాని, గుళ్లపల్లి జనార్దనరావు, చెరువు ఆదినారాయణ, శిరివూరి జానకి రామచంద్రరాజు, కండాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీదేవి, జేవీ సత్యనారాయణమూర్తి, దండమూరి బాబూరావు, ఎ.రామకృష్ణారావు, కృష్ణమోహన్, బ్యాంక్ సీఈవో పీవీ నరసింహమూర్తి, డిప్యూటీ సీఈవో వరలక్ష్మి, జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.



రాఘవేంద్రరావును సత్కరిస్తున్న ప్రముఖులు

మార్చి 26 నుంచి సుదర్శన నారసింహ మహాయజ్ఞం

సింహాచలం: సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. దేశం శస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు లభించాలని కాంక్షిస్తూ మహాయజ్ఞం నిర్వహించనున్నామన్నారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమయ్యే మహా యజ్ఞం ఏప్రిల్ 1న జరిగిన మహాపూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం 10.07 గంటలకు సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో భూమిపూజ నిర్వహిస్తామని తెలిపారు.

దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

అగనంపూడి: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా బ్రహ్మకుమారీస్ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మౌంట్ అబూ(రాజస్థాన్) ప్రతినిధి రాజయోగి బీకే దిల్‌రెడ్డి భాయీజీ తెలిపారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలెంలో శనివారం బ్రహ్మకుమారీస్ విద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి తన దైనందిన జీవితంలో శారీరిక రుగ్మతలతోపాటు మానసిక ఆందోళనలకు గురవుతున్నారని, వీటి నుంచి ఉపశమనం కోసం బ్రహ్మకుమారీస్ సంస్థ మానసిక ప్రశాంతత, ప్రపంచ శాంతి, పరివర్తన కోసం ఇప్పటి వరకు అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. బాలల నుంచి వయో వృద్ధులు కూడా మానసిక ఒడిదుడుకులకు లోనవుతున్నారని, ముందుగా వీటి నుంచి విముక్తిని కలిగించడం సంస్థ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ బీకే సోమేశ్వరి అక్కయ్య, అగనంపూడి సంస్థ ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు బి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ బీకే రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మకుమారీస్ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీకే దిల్‌రెడ్డి భాయీజీ

నూతన వేతనాల అమలు తర్వాతే బయోమెట్రిక్

గాజువాక: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేసిన తర్వాతే బయోమెట్రిక్ అమలుకు అంగీకరిస్తామని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు అన్నారు. ఉక్కు పరిపాలన భవనంలో యాజమాన్యం కార్మిక సంఘాల నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు యాజమాన్యానికి స్పష్టం చేశారు. కార్మికులు 40 ఏళ్లుగా అదనంగా అరగంట పనిచేస్తున్నారని, ఆ అంశం తేల్చాలన్నారు. కార్మికుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్‌టీఏ, ఇన్సెంటివ్, గోల్డ్ కాయిన్, సిల్వర్ కాయిన్ తదితర ఆర్థిక సదుపాయాలు కోల్పోయారన్నారు. బయోమెట్రిక్ అమలు చేసే ముందు కార్మికులకు నూతన వేతనాల అమలు, క్యాంటీన్లలో సదుపాయాలు మెరుగుదల, భద్రతా పరిస్థితుల పెంపు వంటి అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కంపెనీ ఆర్థిక పరిస్థితులను వివరించారు. త్వరలో ఈ పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. యాజమాన్యం ప్రవేశపెట్టనున్న బయోమెట్రిక్ అమలుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్య రామ్, వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, డి.వి.రమణారెడ్డి, వరసాల శ్రీనివాసరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'టాపర్స్ అండ్ ర్యాంకర్స్' పుస్తకావిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: వ్యక్తిత్వ వికాస శిక్షకుడు అలజంగి ఉదయ్‌కుమార్ ఆంగ్ల భాషలో రచించిన టాపర్స్ అండ్ రాంకర్స్ పుస్తకాన్ని 68వ వార్డు మిందిలోని ఐడియల్ పాఠశాలలో శనివారం బీహెచ్‌పీవీ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయురాలు నిర్మల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే భాషా పరిజ్ఞానం పెంచుకోవడానికి పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పుస్తకంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించిన విధానం అభినందనీయమని ప్రశంసించారు. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంత వరకు తాను ఏడు పుస్తకాలు రచించాని, ఆంగ్ల భాషలో ఇదే మొదటి పుస్తకమన్నారు. అనంతరం నిర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐడియల్ స్కూల్ అధ్యక్షురాలు అలజంగి అన్నపూర్ణమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రెండు బస్సులు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో శనివారం ఉదయం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న సంఘటనలో ఓ బస్సు డ్రైవర్‌తో పాటు ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు వివరాలివి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి యలమంచిలికి 440 వై బస్సు వెళ్తుండగా అదే నంబర్‌తో యలమంచిలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తుంది. సెక్టార్-8 కాంప్లెక్స్ కూడలిలో మలుపు వద్దకు వచ్చేసరికి ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న బస్సు డ్రైవర్ పి.రాము(29) ఎక్స్‌లేటర్ కింద కాలు ఇరుక్కుపోయి మడమ తెగింది. అలాగే ఓ మహిళ, మరో టీచర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రామును కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిపోయారు. గాయపడిన మహిళ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు.



ఢీకొన్న ఆర్టీసీ బస్సులు



డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

దేశంలో అతిపెద్ద కార్మిక సంఘం బీఎంఎస్


అక్కిరెడ్డిపాలెం: దేశంలోనే రెండు కోట్ల మంది సభ్యులతో అతిపెద్ద కార్మిక సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఉందని సంఘ్ అఖిల భారత అధ్యక్షుడు హిరన్మయ పాండ్య తెలిపారు. శనివారం 69వ వార్డు షీలానగర్ వెంకటేశ్వర కాలనీలోని బీవీకే స్కూల్‌లో బీఎంఎస్ ఆంధ్రప్రదేశ్ 4వ మహాసభ నిర్వహించారు. ముందుగా పతాకావిష్కరణతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాండ్య మాట్లాడుతూ దేశంలో ఉన్నటువంటి 740 జిల్లాలకు 570 జిల్లాల్లో బీఎంఎస్ శాఖలు పని చేస్తున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా కేంద్రంలో, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ కార్మికుల పక్షాన పని చేస్తుందన్నారు. సామాజిక భద్రత చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించడం వల్ల దేశంలో ఉన్న 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు లాభం చేకూరుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామన్నారు. బీఎంఎస్ కృషితో అసంఘటిత కార్మికులకు ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు అందాయన్నారు. రాష్ట్ర బీఎంఎస్ అధ్యక్షుడు మన్నవ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్లా జగదీశ్వరరావు, దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి దురై రాజ్, ఎన్ఈసీ మెంబర్ ఆషామోల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, కార్యదర్శి లోవ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రొక్కం సురేష్ కుమార్, కార్యదర్శి శరగడం రామచంద్రశేఖర్, కోశాధికారి లాలం ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు హిరన్మయ పాండ్య

ఏయూతో పనిచేయడానికి జపాన్ సంస్థ ఆసక్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో పనిచేయడానికి జపాన్‌కు చెందిన ఏమని ఎంజైమ్ ఇంక్ ఇన్నోవేషన్ సెంటర్ గిఫు జపాన్ ఆసక్తి వ్యక్తం చేసింది. జపాన్ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ జి.కిరణ్ కుమార్ శనివారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, హెల్త్ కేర్ రంగాలలో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఏయూతో విభిన్న అంశాలలో కలసి పనిచేయాలని, పరిశోధన రంగంలో విదేశాలతో పనిచేయడానికి ఏయూ సిద్ధంగా ఉందని వీసీ ప్రసాద రెడ్డి స్పష్టం చేశారు. అదే విధంగా ఏయూ పూర్వ విద్యార్థులు విదేశాలలో ఉన్నత స్థానాలలో స్థిర పడటంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్‌ను జపాన్ సంస్థ భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా పరిశోధన రంగంలో విద్య సంస్థలతో సంయుక్తంగా పనిచేసే దిశగా భారత్‌కు పంపింది. నీతి ఆయోగ్ విశాఖకు ఎకనామిక్ గ్రోత్ ఇంజన్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో విశాఖలోని వివిధ రంగాలను పరిశీలించడానికి కిరణ్ కుమార్ ఏయూకు విచ్చేశారు. అనంతరం ఏయూలోని జపాన్ అధ్యయన కేంద్రాన్ని కిరణ్ కుమార్ సందర్శించారు. ఏయూలో జపాన్ భాషను నేర్పించే దిశగా అందిస్తున్న వివిధ కోర్సులు వివరాలు డాక్టర్ మూర్తి తెలియజేశారు.



కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి